ఘనంగా 'మాత కుసుమ కుమారి' జయంతి




కుసుమ హరనాథులు, అర్ధ ఏకాహం(భజన)లో పాల్గొన్న కుసుమ హరనాథ భక్తులు

నల్లకుంట: డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీలో ఉన్న శ్రీకుసుమ హరనాథ ఆశ్రమం భక్తులతో పోటెత్తింది. ఆదివారం మాత కుసుమ కుమారి 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అర్చక స్వాములు కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అర్ధ ఏకాం(భజన) కార్యక్రమం జరిగింఞ.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కుసుమ హరనాథులను భక్తితో స్మరించుకున్నారు.

బ్రాహ్మణ సంఘాలు ఏకీకృతం కావాలి

టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు

నల్లకుంట: బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ సంఘం(బీఏపీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 29న రవీంద్రభారతిలో బ్రాహ్మణ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని బ్రాహ్మణ సంఘాలు ఏకీకృతం కావాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లకుంటలో టీబీఎస్ఎస్ రాష్ట్ర ముఖ్య నేతల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ... బ్రాహ్మణ విద్యార్థులకు చెల్లించాల్సిన రెండో విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం వచ్చే ఎన్నికల్లో తమ వర్గానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ సమ్మేళనంలో బ్రాహ్మణ సంఘం భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికను రూపొందించనున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీబీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అవ్వ లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, దేశ్‌ముఖ్ రమాకుమార్, కోశాధికారి మంత్రి సునిల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బాలచందర్ శర్మ, ప్రధాన కార్యదర్శి గంప రామశర్మ, సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలి



దివ్యాంగులకు అందజేసిన పరికరాన్ని పరిశీలిస్తున్న కావ్య కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ చేయూతతో ఆదివారం దివ్యాంగులకు సహాయ పరికరాలు, ఉపకరణల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్లు కన్నె ఉమారమేశ్‌యాదవ్, వై.అమృత, నాయకులు కృష్ణగౌడ్, అజయ్ కుమార్, వనం రమేష్, భూషణ్‌చారి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి రంగనాథానంద జయంతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో ఆదివారం స్వామి రంగనాథానంద జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 'ఇండియన్ కల్చర్ అండ్ ఇట్స్ సాఫ్ట్ పవర్ స్ట్రెంత్'అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ అధ్యక్షుడు డాక్టర్ వినయ్ సహస్త బుద్ధే హాజరై మాట్లాడుతూ... సర్వమానవ, సర్వప్రాణకోటి శ్రేయస్సును కోరుకునే భారత్ అనాదిగా విశ్వానికి మిత్రుడిలా ఉందన్నారు. యోగా, ఆయుర్వేదం, ఆధ్యాత్మికం అనేది భారత్ ప్రపంచానికి అందించిన వరాలు అని చెప్పారు. రామకృష్ణమఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ హైదరాబాద్ రామకృష్ణ మఠం తొలి అధ్యక్షుడిగా, రామకృష్ణమఠం మిషన్ 13వ సర్వాధ్యక్షుడిగా స్వామి రంగనాథానంద పనిచేశారన్నారు. తన పనితీరు, వ్యక్తిత్వంతో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చారని తెలిపారు. ఆయన రామకృష్ణ మఠం చరిత్రలో చెరగని ముద్రవేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి వచ్చిన రామకృష్ణ మఠం వివిధ శాఖల స్వాములు, భక్తులు, వలంటీర్ల పాల్గొన్నారు.

లింగబలిజలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సంఘం సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు పటోళ్ల సంఘమేశ్వర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: వీరశైవ లింగాయత్ లింగబలిజలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంఘమేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర కమిటీ సభ్యులు శివప్ప, సిద్దుల బాలకృష్ణ, నాయకోటి ప్రభు, మర్రి ఈశ్వరప్పల సంతాప సభ జరిగింది. అనంతరం పటోళ్ల సంఘమేశ్వర్ మాట్లాడుతూ... నూతన సంవత్సర కేలండర్, డైరీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీతో బసవ భవన నిర్మాణం పూర్తయ్యిందని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 45లక్షల జనాభా ఉన్న వీరశైవ లింగాయత్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్పా, ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్, సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్, మల్లికార్జునప్పా తదితరులు పాల్గొన్నారు.

భవితకు భరోసా భగవద్గీత శ్లోకాలు



ముషీరాబాద్: భవితకు భరోసా భగవద్గీత శ్లోకాలని 320ఏ లయన్స్ క్లబ్ 1వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. డాక్టర్ కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ బాలికల ఎస్సీ వసతి గృహంలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు, పుస్తకాలు, బాలికలకు నెల రోజులకు సరిపడు కాస్మెటిక్స్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను సుహాసిని స్పాన్సర్ చేసి అందజేశారు. ఈ సందర్భంగా డా. మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. భగవద్గీత శ్లోకాలు నైతిక విలువలు, జీవన పాఠాలు అందించడమే కాకుండా మనస్సుకు శాంతిని కలిగిస్తాయన్నారు. భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపదలో ఒక అపార రత్నమన్నారు. సుహాసిని పాటలు పాడి బాలికలను ఉత్సాహపరిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర, సుహాసిని, జ్యోతిరాజా, జయశ్రీ, డా. హిప్నో పద్మాకమలాకర్, అధికారులు పాల్గొన్నారు.

అపురూపమైన సంపద తెలుగు భాష



చిమ్మపూడి ఫౌండేషన్ సంచికను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

చిక్కడపల్లి: తెలుగు భాష సంపద అపురూపమని దాని వైభవం నేటి తరాలకు తెలియజేయాలని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం త్యాగరాయ గానసభలో 'యువ భువన విజయం'సాహిత్య సంగీత రూపకం ప్రదర్శించారు. స్కూల్, ఇంజినీరింగ్ విద్యార్థులు రూపకంలో పాల్గొని పద్యాలతో సంభాషణ చేసి అలరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కేవీ రమణచారి కళాకారులను సత్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాధన నరసింహచార్య , రచయిత్రి డా. ముక్తేవి భారతి, డా. లలిత వాణీ, డా. మల్లా ప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సంగీతం మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తుందని సినీనటుడు ఉత్తేజ్ అన్నారు. మధు స్వరమాలిక ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో నవరస సుమమాలిక శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా సినీ సంగీత దర్శకుడు సాయిదేవ్‌కు ఇసాయి విధాన్ పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రమణ, శ్రీమణి, శివం, ఉమా మాధవి, శ్రీనివాసన్, ఫాల్గుణ, సింహాద్రి, శ్రీకాంత్, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

రచయిత జయరాములు గ్రంథాల ఆవిష్కరణ

కమలాకృష్ణ కళా కౌముది, కుసుమ ధర్మన్న కళా పీఠం సంస్థల ఆధ్వర్యంలో బి.జయరాములు రచించిన అమెరికా టు హైదరాబాద్, శంభు లింగేశ్వర శతకం, ఆత్మీయులు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. త్యాగరాయ గానసభలోని సంగీత నాట్యకళా వేదికలో తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు గ్రంథాలను ఆవిష్కరించి మాట్లాడారు. బాల్య స్మృతులు , కుటుంబ బంధాలను జయరాములు చక్కగా వివరించారని అన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ప్రొ. కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాధా కుసుమ, సుశీల, సోమయ్యశాస్త్రి, దశరథ రామయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆంధ్ర నాట్య ప్రదర్శన

వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో పద్మ మోహన్ దిండలూరి ఆధ్వర్యంలో ఆంధ్ర నాట్య ప్రదర్శన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి, ఆంధ్ర నాట్య కళాకారుడు డా. కళా కృష్ణ హాజరై పద్మ మోహన్‌ను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. భామా కలాపం కథను సంక్షిప్తంగా పద్మ నర్తించి ఆకట్టుకున్నారని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు, ఉమా మహేశ్వరి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాయిదేవ్‌కు ఇసాయి విధాన్ పురస్కారం ప్రదానం చేస్తున్న సినీనటుడు ఉత్తేజ్, రమణ, శ్రీమణి



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ప్రొ. కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

అన్నదానం

చిక్కడపల్లి: అన్నదానం చేయడంలో ఉన్న పుణ్యం దేనిలో లేదని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడకుల బాలస్వామి అన్నారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా చిక్కడపల్లి వాసవి సేవ సమితి అధ్యక్షులు తొడుపునూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి అమురి బాలకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణ, సంతోష్, కేవీవీ ప్రసాద్, శ్రీరామ్, సాయిబాబా, బొమ్మెర శ్రీనివాస్, శ్రీరామం నాగేష్ పాల్గొన్నారు.

సేవా భావంతో వైద్యం



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శైలజ

అంబర్‌పేట: సేవా భావంతో పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని సాయిదత్త ఆస్పత్రి అధినేత డా. ధనుంజయ్ అన్నారు. ఆదివారం మల్లికార్జుననగర్‌లోని ఆసుప్రతి ఆవరణలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కుమార్, కె.శైలజ, ఆస్పత్రి కో-ఆర్డినేటర్ బోనం వీరబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

అంబర్‌పేట: అనారోగ్యంతో మృతి చెందిన దివ్యాంగుడి కుటుంబానికి దివ్యాంగుల సంఘం చేయూతనిచ్చింది. ఇటీవల అంబర్‌పేట మున్సిపల్ కాలనీకి చెందిన ఏనుగుల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందారు. ఎన్‌పీఆర్‌పీ జాతీయ అధ్యక్షుడు మంద భిక్షపతియాదవ్ ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆవిర్భావ్-24

కవాడిగూడ: గగన్ మహల్‌లోని ఏవీ కళాశాలలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా కళాశాల పీజీ డైరెక్టర్ భగవంత్‌రెడ్డి, ఎంబీఏ డైరెక్టర్ వినితాశర్మ, సినీనటి నేహాల్ గంగావత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రమశిక్షణ పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని అన్నారు. విద్యార్థులు ఆ దిశగా పయనించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రపంచంతో పోటీ పడాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమన్వయ కర్తలు జి. భరత్, కీర్తి, సాయిప్రీత్, నందిని పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న అతిథులు

'ప్రభుత్వ కంపెనీలను కేంద్రం విస్మరిస్తోంది'



టీయూసీఐ ముగింపు సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి రాజేష్ కన్నా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని టీయూసీఐ జాతీయ కార్యదర్శి దొంతి రాజేష్ కన్నా విమర్శించారు. బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన టీయూసీఐ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా దొంతి రాజేష్‌కన్నా మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వ కంపెనీలను కేంద్రం విస్మరిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించడం అత్యంత బాధాకరమని అన్నారు. కార్మిక వర్గాలను సమైఖ్య పరిచి పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

- టీయూసీఐ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రెడ్డి కె థాజత్ మాట్లాడుతూ... కార్మికులు అంతర్జాతీయంగా పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పనిగంటలు, యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, కనీస వేతనాల చట్టం, భద్రత హక్కులు, ఫ్యాక్టరీ చట్టాలను నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు.
- మళ్లీ హక్కులను సాధించేకునేందుకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జీ, కార్యదర్శులు బన్‌సోడే, మారీదు ప్రసాద్ బాబు, బుద్రి ప్రసాద్ మిశ్రా, కోశాధికారి టీబీ మినీ, రాకేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 25 మందితో కేంద్ర కమిటీ, 21మందితో జనరల్ కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పోరాటం ఎనలేనిది

విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య



అరుణోదయ 50 వసంతాల కార్యక్రమంలో మాట్లాడుతున్న అంబటి నాగయ్య



ఉత్సవంలో పాటలు పాడుతున్న విమలక్క తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అత్యంత ప్రాచీనమైన మన సంస్కృతిని బ్రాహ్మణీయ భావజాలం ఫాసిజం పేరుతో దాడులు జరుగుతున్నాయని విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ 50 వసంతాల ముగింపు ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబటి నాగయ్య మాట్లాడుతూ... ప్రజా సాంస్కృతిక ఉద్యమాలతో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చేస్తున్న పోరాటం ఎనలేనిదన్నారు. సామ్రాజ్యవాద సంస్కృతితో ఈనాటి వ్యవస్థ అత్యంత దారుణంగా మారిందన్నారు. ఈ వ్యవస్థలో సామాన్య ప్రజలు వివక్ష, నిర్బంధాలకు గురవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం అరుణోదయం సావనీర్‌ను ఆవిష్కరించారు. మల్సూర్, ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోత్కూరు శ్రీనివాస్, ప్రొ. కొండా నాగేశ్వర్‌రావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, జూపాక సుభద్ర, కరుణ, సుధాకర్, మాస్టర్‌జీ, మన్నాడం నాగరాజు, జనార్దన్, కల్వకుర్తి రాములు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

లిబర్టీ: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆగమేఘాల మీద జమిలీ ఎన్నికల బిల్లు ప్రవేశపెడుతున్న క్రమంలో బీసీ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టరని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం జమిలి ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ బీసీ బిల్లుపై ఎందుకు లేదని నిలదీశారు. ఆదివారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు నాలుగు సంవత్సరాల సమయం ఉందని ఇప్పటికిప్పుడే బిల్లు ఎవరికి కోసం తెచ్చారన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును కూడా శీతాకాల పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టి బాగుండేదని కుమారస్వామి అన్నారు.

నిదరోతున్న నిఘానేత్రాలు..!



అరవింద్‌నగర్‌లో చెట్టు కొమ్మల చాటున సీసీ కెమెరా



ఇందిపార్కు ధర్నా చౌక్‌లో నేలచూపులు చూస్తూ ఇలా..

ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిదరోతున్నాయి. నేరాల నియంత్రణలో కీలకంగా మారిన సీసీ కెమెరాల నిర్వహణ గాలికొదిలేశారు. పని చేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. – కవాడిగూడ

మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి

కాచిగూడ: త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ముదిరాజ్ అభ్యర్థులను సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా గెలిపించుకోవాలని ఆయన ముదిరాజ్‌లకు పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ శంకర్‌ముదిరాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘాలు, బీసీ సంఘాల నేతలు పాల్గొని కేక్ కట్‌చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్, శైలేంద్ర, శివయ్య, రిషికుమార్, బాలరామ్, పిట్ల నాగేష్, సుధాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంగా బీసీని నియమించాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అగ్రకులాలకు సీఎం పదవి, దళితులకు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టారని త్వరలో జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో జనాభాలో 55శాతంకు పైగా ఉన్న బీసీలకు కూడా డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీసీ బిడ్డ ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను డిప్యూటీ సీఎంగా నియమించాలని కోరారు. విద్యార్థి దశ నుంచి యువజన, నిరుద్యోగ సమస్యలపై పోరాడుతూ వచ్చారన్నారు. అపార అనుభవంతో పాటు ఎలాంటి మచ్చలేని వ్యక్తి మహేష్ కుమార్‌గౌడ్ అని అన్నారు. డిప్యూటీ సీఎం పదవి ఇస్తే 55శాతం ఉన్నటువంటి బీసీలకు న్యాయం చేసినట్లువుతుందని అన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు పదవులు కేటాయిస్తామని చెబుతున్న కాంగ్రెస్ అధిష్టానం ఇప్పుడు నిరూపించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

అంబర్‌పేట: బీజేపీని క్షేత్రస్థాయిలో పటిష్ట పరిచేందుకు ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గౌతమ్‌రావు కోరారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో బాగ్‌అంబర్‌పేట డివిజన్ 15వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.వెంకటరమణకు ఆదివారం ఆయన నియామక పత్రం అందజేశారు. డివిజన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆయనను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, చూక్కజగన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు సభ్యుడిగా నాగభూషణంచారి



అంబర్‌పేట: సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా దాసోజు నాగభూషణంచారి నియమితులయ్యారు. ఫిల్మ్ సెన్సార్ బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు హైదరాబాద్ రీజినల్ బోర్డు అధికారి ఎస్.కుమార్ నిమమాక పత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. బీజేపీలో వివిధ స్థాయిల్లో పనిచేసినందుకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గౌతమ్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సంక్షేమ హాస్టళ్లలో ఒకపూట భోజనం చేయాలి

కాచిగూడ: బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం వంద శాతం అందాలంటే ముఖ్యమంత్రి నుంచి గ్రామ సర్పంచ్ వరకు, విలేజ్ సెక్రటరీ నుంచి చీఫ్ సెక్రటరీ వరకు ఉన్న అధికారులు ఒకపూట భోజనం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక సంక్షేమ హాస్టళ్ల నుంచి లంచ్ బాక్స్‌లను తమ దగ్గరకు తెప్పించుకుని తినేలా ఒక చట్టాన్ని తీసుకురావాలన్నారు. దీంతోనే తెలంగాణలో సామాజిక విప్లవం వస్తుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ఒకపూట హాస్టళ్లలో తింటే విద్యార్థులకు ప్రతిరోజు పండగ భోజనం లభిస్తుందని అన్నారు.

జనవరి 11న వడ్డె ఓబన్న జయంతి


- వడ్డెరులు ఐక్యమత్యంతో ముందుకు సాగాలి
- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జె. జైపాల్



ఉత్సవ కమిటీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వడ్డెరులు ఐకమత్యంతో ముందుకు సాగి అభివృద్ధి బాటలో పయనించాలని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వడ్డె ఓబన్న జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ... విద్యాపరంగా అభివృద్ధి చెందినప్పుడే సామాజికంగా నిలదొక్కుకోగలుగుతారని అన్నారు. వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు చల్లంగుల కృష్ణయ్య మాట్లాడుతూ... జనవరి 11వ తేదీన నగరంలో వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవ కమిటీలో కుల సంఘం అధ్యక్షుడు అందరూ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం అధ్యక్షులు శివరాత్రి అయిలి మల్లు, వేముల వెంకటేష్, మొగిలి సమ్మయ్య, రాజ్యలక్ష్మి, వేముల యాదయ్య, ఒర్సు శ్రీనివాస్ రాజు, ఎత్తరి అంతయ్య, లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



నల్లకుంట: ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభించిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో ఓ వృద్ధుడు (యాచకుడు) అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. సమీపంలోని ఉషాకిరణ్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఓయూ ఎన్‌సీసీ గేట్ పరిసరాలలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, కొంత కాలంగా ఆస్తమాతో బాధపడుతున్నాడని వాచ్‌మెన్ గోపి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు. ఈ మృతుడి వివరాలు తెలిసినా.. అతడిని గుర్తుపట్టినా నల్లకుంట ఠాణాకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.